epaper.manachourasta.com

# మన చౌరాస్తా

తెలుగు దినపత్రిక



కొత్తకొండ జాతర

## ప్రారంభం

■ నేడు మంత్రుల రాక

4

సంపుటి : 01 | సంచిక : 48 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | గురువారం, 15 జనవరి 2026 | పేజీలు : 04



# పరివేద జాతరకు రావాలని..



**కోహెడ, మన చౌరాస్తా :** మినీ మేడారంగా పేరుగాంచిన పురాతన పరివేద సమ్మక్క-సారాలమ్మ జాతరకు హాజరుకావాలని జాతర కమిటీ సభ్యులు కేంద్ర మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌ను ఆహ్వానించారు. ఈ సందర్భంగా శనివారం కరీంనగర్‌లోని ఆయన నివాసంలో ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో జాతర కమిటీ సభ్యులతో పాటు బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఖమ్మం వేంకటేశం, బీజేపీ మండల అధ్యక్షుడు జాలిగం రమేష్, పరివేద బీజేపీ గ్రామశాఖ అధ్యక్షుడు పెండ్యాల సంపత్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే పరివేద సర్పంచ్‌తో పాటు జాతర కమిటీ సభ్యులు మీస కొమురయ్య, మాజీ సర్పంచ్ చాడ సుదర్శన్ రెడ్డి, చాడ రాజిరెడ్డి, గుంట మల్లయ్య, కూరేళ్ల వేణు, గవ్వ వీరా రెడ్డి, పొన్నం శ్రీనివాస్, సిసిపల్లి మల్లయ్య తదితరులు హాజరయ్యారు.

## అన్నప్రసాద వితరణ

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** ముత్తారం గ్రామంలోని త్రికూటేశ్వర ఆలయంలో నిర్వహించిన మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమం తొలి రోజు విజయవంతమైంది. కార్యక్రమంలో 500కు పైగా భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ కాశిరెడ్డి ఆదిరెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి, కనుమ పర్వదినాల సందర్భంగా కూడా మహా అన్నప్రసాద వితరణ కొనసాగుతుందని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అన్నప్రసాద వితరణ సమయాన్ని పొడిగించినట్లు పేర్కొన్నారు. ఉత్తర తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన కొత్తకొండ జాతరకు వచ్చే భక్తులు తప్పకుండా ముత్తారం త్రికూటేశ్వర ఆలయాన్ని దర్శించాలని కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఇక్కడ త్రికూటేశ్వరుని దర్శనంతో పాటు బ్రహ్మసూత్రం గల శివలింగాన్ని దర్శించుకోవడం ద్వారా ప్రత్యేక పుణ్యఫలం లభిస్తుందని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, స్వచ్ఛంద సేవకులు కీలక పాత్ర పోషించారు. భక్తుల సౌకర్యార్థం తాగునీరు, వసతి, శుభ్రత ఏర్పాట్లు సముచితంగా చేయడం విశేషంగా నిలిచింది.





## మర్రిముస్త్యాలలో ముగ్గుల పోటీలు

**కొమురవెల్లి, మన చౌరాస్తా :** కొమురవెల్లి మండలం మర్రి ముస్త్యాల గ్రామంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా రెండవ వార్డు మెంబరు దార రాజు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా మొదటి బహుమతి కావటి అంజనీ శ్రీ, భావన, రెండవ బహుమతి కాసుల దేవి, మూడవ బహుమతి దేవునూరి, మానస గెల్చుకున్నారు. కార్యక్రమంలో సర్పంచి జంగని రవితో పాటు కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ తురాయి నవీన్ గౌడ్, సీనియర్ నాయకులు పుల్లం బిక్షపతి గౌడ్, వంగ గాలిరెడ్డి, మంత్రి శ్రీనివాస్, బెజ్జంకి పద్మ, తలారి నర్సింలు, చింతల రాములు, శ్రీనివాస్ పాల్గొన్నారు.



## వేణుగోపాల స్వామి గుడిలో భగవద్గీత పారాయణం

**దూల్మిట్ట, మన చౌరాస్తా :** జాలపల్లి గ్రామం శ్రీ వేణుగోపాలస్వామి గుడి లో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని భజన మండలి ఆధ్వర్యంలో భవద్గీత పారాయణం మరియు విష్ణు సహస్రనామాలు సత్సంగం ఘనంగా జరిగింది. పూజారులు భగవంతుని ఆశీర్వచనం తో పాటు ప్రసాదాలు అందజేశారు .ఇట్టి కార్యక్రమానికి అమ్మపురం, నర్మేట బండనాగారం ఐనాపురం తదితర గ్రామాల భక్తులు మరియు గురువులు రావడం జరిగింది.వారికి జాలపల్లి గ్రామ మాజీ సర్పంచి చొప్పరి వరలక్ష్మి సాగర్ గారు శాలువాతో సన్మానించి సంభావన ఇవ్వడంజరిగింది. అనంతరం అన్న ప్రసాద దాత దాసరి శంకరయ్య గారిచే మహా అన్న ప్రసాద కార్యక్రమము జరిగినది.

## తపస్‌పల్లిలో ముగ్గుల పోటీలు



**కొమురవెల్లి, మన చౌరాస్తా :** కొమురవెల్లి మండల కేంద్రంలోని తపస్ పల్లి గ్రామంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామ సర్పంచ్, పాలకవర్గం ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పుట్ట కనకరాజు మాట్లాడుతూ సంక్రాంతి పండుగను సుఖ సంతోషాలతో జరుపుకోవాలని, అందంగా ఇంటి ముందు ముగ్గులు వేయాలని అన్నారు. ముగ్గులు పోటీలో గెలిచిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను సర్పంచ్ అందజేశారు. కార్యక్రమంలో మూలుగు నర్సింలు, వార్డు సభ్యులు కంకణాల నందు, కొండపాక లచ్చవ్వ, కంకణాల భాగ్య, మూలుగు చంద్రమౌళి, గుర్రాల నరసింహులు, కంకణాల ప్రవీణ్, కంకణాల నరేష్, ఏల ప్రవీణ్, లకుడబోయిన నరేష్, మాజీ సర్పంచ్ ఈగ యాదయ్య, గ్రామ బీఆర్ఎస్ ప్రెసిడెంట్ సాయిబాబు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



## చిన్నారులకు గాలిపటాల అందచేత

**కొమురవెల్లి, మన చౌరాస్తా :** రసూలాబాద్ ప్రాథమిక పాఠశాల యందు భోగి పండుగ సందర్భంగా మాజీ సర్పంచ్ పచ్చిమడ్ల స్వామి గౌడ్ చిన్న పిల్లలకు పతంగులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ చైనా మాంజా వాడకూడదని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఏరోళ్ల సుదర్శన్, కూడిక్యాల శ్రీనివాస్, మానుపాడు మహిపాల్, సంతోష్ పాల్గొన్నారు.



## అక్రమ లేఅవుట్ హద్దు రాళ్ల తొలగింపు

**కొమురవెల్లి, మన చౌరాస్తా :** కొమురవెల్లి మండలంలోని గురువన్న పేట గ్రామ శివారులో ఎలాంటి అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన అక్రమ వెంచర్ లోని హద్దురాలను బుధవారం పంచాయతీ కార్యదర్శి మురళి ఆధ్వర్యంలో సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ అనుమతి లేని వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసి ఇబ్బందులు పడవద్దని సూచించారు.




## రోడ్డు భద్రతపై ముగ్గుల పోటీ

**జనగామ, మన చౌరాస్తా :** జాతీయ రోడ్డు భద్రత మాస ఉత్సవాల్లో భాగంగా రవాణా శాఖ ఆధ్వర్యంలో రంగవల్లుల ప్రోగ్రాం నిర్వహించారు. ఈ యొక్క కార్యక్రమంలో మహిళలు పాల్గొని రోడ్డు భద్రత సంబంధించిన రంగవల్లులు వేశారు. కార్యక్రమంలో రవాణా శాఖ అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# వంగరలో ఘనంగా వీరభద్ర రథోత్సవం

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** భారతరత్న మజీ ప్రధాని స్వర్గీయ పి.వి. నరసింహారావు స్వస్థలమైన వంగరలో శత సంవత్సరాలకు పైగా కొనసాగుతున్న శ్రీ వీరభద్ర స్వామి రథోత్సవం గురువారం ఘనంగా నిర్వహించనున్నారు. వంగర నుంచి కొత్తకొండ వరకు జరిగే ఈ రథోత్సవం భక్తుల నడుమ అపూర్వ వైభవాన్ని సంతరించుకుంటుంది. రథోత్సవంలో శివసత్తుల పూనకాలు, యాదవుల డోలు విన్యాసాలు, మాదిగల డప్పు నృత్యాలు, మహిళల కోలాటాలు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. వందేళ్లకు పైగా కొనసాగుతున్న ఈ ఉత్సవాన్ని గ్రామ ప్రజలు “శతాధిక రథోత్సవం”గా అభివర్ణిస్తున్నారు. ఈ రథోత్సవానికి విశిష్టమైన చరిత్ర ఉంది. గ్రామానికి చెందిన పాములపర్తి వెంకట రంగారావు, రత్తమ్మ దంపతులు సంతాన ప్రాప్తి కోసం కోరమీసాల కొత్తకొండ వీరభద్ర స్వామిని ప్రార్థించి, మొక్కుబడిగా ప్రతి ఏటా రథోత్సవం నిర్వహిస్తామని సంకల్పించారు. ఆ క్రమంలోనే దాయాదుల కుటుంబానికి చెందిన పాములపర్తి సీతారామారావు పెద్ద కుమారుడు పి.వి. నరసింహారావును దత్తతగా స్వీకరించారు. దీనిని స్వామి చలువగా పూర్వీకులు భావిస్తారు. 1926లో ప్రారంభమైన ఈ రథోత్సవాన్ని పి.వి. వంశస్థులు



తరతరాలుగా క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు. గతంలో ఈ రథం మూడు అంతస్తులుగా, సంపూర్ణ కలపతో తయారుచేసి, ఆరు జతల ఎద్దులతో లాగేవారు. విద్యుత్ తీగల కారణంగా ప్రస్తుతం ఒక అంతస్తుకు పరిమితం చేసి, రెండు జతల ఎద్దులతో రథాన్ని లాగుతున్నారు. రథ చక్రాలను కొల్ల మల్లారెడ్డి, రాజారెడ్డి వంశస్తులు అందించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. భక్తులు గుమ్మడి, బెల్లం, బియ్యం వంటి మొక్కులను రథం ద్వారా సమర్పిస్తారు. దారి పొడవునా మంగళ దీపాలతో స్వాగతం పలకడం, ఎద్దులకు జలాభిషేకం చేయడం సంప్రదాయంగా వస్తోంది. కొత్తకొండ చేరుకున్న తర్వాత రథానికి పరిక్రమణ చేసి, రాత్రి అక్కడే ఉండి తెల్లవారుజామున వంగరకు తిరుగు ప్రయాణం సాగుతుంది.



## మల్లన్నను దర్శించుకున్న సిద్దిపేట సీపీ

**కొమురవెల్లి, మన చౌరాస్తా:** ప్రముఖ శైవ క్షేత్రమైన శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామిని సిద్దిపేట సిపి పెరుమల్ రష్మీ దర్శనం చేసుకున్నారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఘనస్వాగతం పలికారు. స్వామివారి శేష వస్త్రంను, మరియు ప్రసాదమును స్వామి వారి చిత్రపటాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు మహాదేవుని మల్లికార్జున్ ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం



**హసన్‌పర్తి, మన చౌరాస్తా :** హసన్‌పర్తి - గంటూరుపల్లి మధ్య ఔటర్ రింగ్ రోడ్ బ్రిడ్జి వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఈర కుషుడు(38) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు కేశపూర్ గ్రామానికి చెందిన మొగిలి కుమారుడు. వృత్తి కూలి పని, పాల వ్యాపారం. ఉదయం ఐదు గంటల ముప్పై నిమిషాల సమయంలో పాలు అమ్ముకునేందుకు బయలుదేరిన ఈర కుషుడిని, రింగ్ రోడ్ పనులు చేస్తున్న టిప్పర్ లారీ ఢీకొట్టడంతో శరీరం నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యులు న్యాయం చేయాలని కోరుతూ హసన్‌పర్తి నేషనల్ హైవే రోడ్డుపై ధర్నాకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రామ్ సాగర్ లో వాలీబాల్ క్రీడోత్సవాలు

**కొమురవెల్లి, మన చౌరస్తా :** కొమురవెల్లి మండలంలోని రామ్ సాగర్ గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా యువతకు వాలీబాల్ క్రీడోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రాజ్యలక్ష్మి మల్లారెడ్డి మాట్లాడుతూ యువత ఈ కార్యక్రమంలోప్రోత్సహిస్తుందనిఅలాగే యువతకు అన్ని రంగాల్లో వాలీబాల్ క్రీడలతో పాటు అన్ని రకాల కార్యక్రమాలన్నీ కూడా నిర్వహిస్తామని వారు తెలిపారు. ఈ సందర్భంగా వాలీబాల్ క్రీడోత్సవాలకు మొత్తం ఎనిమిది టీములు పాల్గొనగా రెండు టీములు గెలిచారు. గెలిచిన విజేతలకు రెండు వేల బహుమానం మరియు ప్లేయర్లకు షీల్డ్ అందించారు. రన్నర్ అప్ కు వెయ్యి రూపాయల బహుమానం తో పాటు షీల్డ్ అందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మల్లారెడ్డి మరియు వార్డు సభ్యులు మరియు గ్రామ పెద్దలు గుండా చంద్రం, అక్కనపల్లి ప్రవీణ్ రెడ్డి, అక్కనపల్లి సత్తిరెడ్డి, అక్కెనపల్లి జైపాల్ రెడ్డి, దొడ్ల నరసింహారెడ్డి,దువ్వల కనకయ్య, తాడూరి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.యాదవ సంఘం, చత్రపతి శివాజీ యూత్, అంబేద్కర్ యూత్ వారి సహకారంతో క్రీడలను నిర్వహించారు.





## మరిముస్త్యాలలో క్రికెట్ టోర్నమెంట్

**మద్దూరు, మన చౌరాస్తా :** సంక్రాంతి సంబురాలలో భాగంగా మర్రిముచ్చాలలో సర్పంచ్ జంగని రవి, ఉప సర్పంచ్ బద్దిపడగ రఘుపతి రెడ్డి. కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు తురాయి నవీన్ గౌడ్. నక్కల నరేష్‌రెడ్డి వారి సహకారంతో ఎంపీఎల్ సీజన్ 4 క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఇందులో భాగంగా బుధవారం ఫైనల్ మ్యాచ్ లో "RISING STARS "టీం ట్రోఫీతో పాటు పదివేల నగదు క్యాష్ గెలుచుకుంది. కార్యక్రమంలో నూతనంగా ఎన్నిక కాబడిన వార్డు మెంబర్లు, గ్రామ యువత, ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.



## వైభవంగా గోదా దేవి కల్యాణం

**యాదాద్రి భువనగిరి, మన చౌరాస్తా :** తుర్కపల్లి మండలం వెంకటాపురంలో శ్రీగోదా రంగనాథ స్వామి కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు బ్రాహ్మణులు వేద మంత్రంతో చరణాలతో రంగనాథస్వామివారి కల్యాణోత్సవం కళ్యాణతంతును కమనీయంగా నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటాపురం గ్రామ సర్పంచ్ కర్రే కరుణాకర్ మాధవి, వెంకటాపురం గ్రామ వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ హనుమకొండ జిల్లా టీ ఇంచార్జిగా మూల రాం గౌడ్

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** బీజేపీ హనుమకొండ జిల్లా టీ ఇంచార్జిగా ముల్కనూరు గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, సీనియర్ బీజేపీ నాయకుడు మూలరాం గౌడ్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన బీజేపీ జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డికి, మాజీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా తనకు ఎల్లప్పుడూ ప్రోత్సాహం అందిస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీలో తనకు సహకరించిన జిల్లా నాయకులందరికీ, భీమదేవరపల్లి మండల అధ్యక్షులు శ్రీ రామోజు శ్రీనివాస్, మండల నాయకులు దొంగల కొమురయ్య, పైడిపెల్లి పృథ్వీ రాజ్, మాచర్ల కుమార్, గండు సారయ్య, ఊసకోయల కిషన్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు.





# కొత్తకొండ వీరభద్రుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- శ్రీచక్రార్చన, నవావరణ పూజలతో భోగి సంబురాలు

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** ఉత్తర తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ గ్రామంలో కొలువైన భద్రకాళీ సమేత వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం భోగి పండుగ రోజున ఘనంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం శ్రీచక్రార్చన, నవావరణ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భోగి పండుగ కావడంతో వీరభద్రుని దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారికి గుమ్మడికాయలు, కోరమీసాలు, కొబ్బరికాయలు సమర్పించేందుకు భక్తులు భారీగా పోటీపడ్డారు. ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఏసీపీ ప్రశాంత్ రెడ్డి నాయకత్వంలో సుమారు 450 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



**కుమ్మరుల వీరబోనమే తొలి బోనం**

కొత్తకొండ వీరభద్రస్వామికి కుమ్మరుల వీరభోనానికి విశిష్టమైన ప్రాధాన్యత ఉంది. మట్టి, అగ్ని, నీరు, గాలి, ఆకాశం అనే పంచభూతాలతో ముడిపడి ఉన్న కుమ్మరి వృత్తికి వీరభద్రుడు శక్తి, రక్షణ కల్పించే దేవుడిగా భక్తులు విశ్వసిస్తారు. ఇది కేవలం ఆచారం మాత్రమే కాకుండా వృత్తి-దైవ సంబంధం, గ్రామ సంప్రదాయం, సామూహిక భక్తికి ప్రతీకగా నిలుస్తుంది. దామెర, కడిపికొండ గ్రామాల నుండి వచ్చిన కుమ్మరులు రథాలు కట్టుకొని, శివసత్తుల పూనకాలు, వీరముష్టుల విన్యాసాల నడుమ వీరభద్రుని సన్నిధిలో తొలి భోనాన్ని సమర్పించారు.

## నేడు మంత్రుల రాక

సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని నేడు రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ వీరభద్రస్వామిని దర్శించుకోనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఏసీ, జాతర ప్రత్యేకాధికారి రామాల సునీత, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ అశోక్ ముఖర్జీ, ఆలయ ఈవో కిషన్‌రావు, ఉప ప్రధాన అర్చకులు రాజయ్య, రాంబాబు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# చంటయ్యపల్లి తండాలో భోగి సంబురాలు

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** చంటయ్యపల్లి తండాలో భోగి పండుగను తండావాసులు అత్యంత భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజామున భోగి మంటలు వేయడంతో పండుగ సంబరాలు ప్రారంభమయ్యాయి. ప్రతి ఇంటి ముందు భోగి మంటలు వెలిగించి, సంప్రదాయ పద్ధతిలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చంటైయ్యపల్లి గ్రామ సర్పంచ్ భూక్య సునీత, మాజీ సర్పంచ్ భూక్య తులసియా, గ్రామ ఉపాధ్యక్షుడు భూక్య రమేష్, మాజీ ఉపసర్పంచ్ భూక్య భీక్య, 3వ వార్డు మెంబర్ భూక్య శంకర్ పాల్గొని గ్రామస్థులకు భోగి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పెద్దలు, చిన్నలు అనే తేడా లేకుండా తండావాసులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని సంప్రదాయ పాటలు, నృత్యాలతో పండుగను మరింత ఉత్సాహంగా నిర్వహించారు. భోగి పండుగ మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, ఇలాంటి పండుగలు గ్రామ ఐక్యతను పెంపొందిస్తాయని నాయకులు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళలు, యువకులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని భోగి పండుగ సంబరాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గ్రామమంతా పండుగ వాతావరణంతో కళకళలాడింది.



# మినరల్ వాటర్ ప్లాంట్‌కు శంకుస్థాపన

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ గ్రామ ప్రజల సౌకర్యార్థం ముల్కనూర్ ప్రజా గ్రంథాలయం ఆధ్వర్యంలో గ్రంథాలయం ముందు 500 లీటర్ల సామర్థ్యం గల మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మాణానికి బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి సలహాదారు వేముల శ్రీనివాసులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి తీసుకురావడమే ఈ ప్లాంట్ లక్ష్యమని తెలిపారు. ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా ఇటువంటి సదుపాయాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. అనంతరం ఇటీవల నూతనంగా సర్పంచ్ బాధ్యతలు చేపట్టిన జాలి ప్రమోద్ రెడ్డిని శాలువాతో సత్కరించారు. గ్రామ అభివృద్ధికి తన వంతు సహకారం ఎప్పటికీ ఉంటుందని ఈ సందర్భంగా వేముల శ్రీనివాసులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రంథాలయ నిర్వాహకులు, గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ మాజీ జెడ్పీటీసీ



**నర్సంపేట, మన చౌరాస్తా :** నర్సంపేటలో బీఆర్ఎస్ పార్టీకి షాక్ తగిలింది. ఆ పార్టీకి రాజీనామా చేసిన మాజీ జెడ్పీటీసీతోపాటు పలువురు నాయకులు ఎమ్మెల్యే దొంతి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. నర్సంపేట మండల మాజీ జెడ్పీటీసీ అజ్మీర పద్మమేగ్య నాయక్, మాదన్నపేట మాజీ ఎంపిటిసి ఉడుగుల రాంబాబు, నాగుర్లపల్లె మాజీ సర్పంచ్ గంగడి తిరుపతిరెడ్డి, కొత్తకొండ రాజు, మాదన్నపేట మున్నూరు కాపు పెద్దమనిషి బొల్లోని రజీరు, హర్ష నాయక్ తండ మాజీ ఉపసర్పంచ్ బానోతు సమ్మయ్య, బానోత్ ప్రేమ్ సింగ్, యూత్ నాయకులు వీరబోయిన మహర్షి పుట్ట రాజశేఖర్ ఆకుల శేఖర్, ఆకుతోట కుమార్, బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఎమ్మెల్యే ఆహ్వానించారు.

Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**